

ఈ అభ్యాస్ ప్రశ్నాపత్రం విడుదల చేస్తున్న అకాడమీ ప్రతినిధులు

# పోటీతత్వాన్ని పెంచేందుకే పరీక్షలు

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 25 : విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంచేందుకు ప్రతిభ పరీక్షలు దోహదం చేస్తాయని ఈ అభ్యాస్ అకాడమీ సీఈవో డాక్టర్ ఫణి పవన్ అన్నారు. ఆదివారం స్థానిక విద్యానగర్‌లోని సెయింట్ అంథోనీస్ పాఠశాలలో నిర్వహించిన ఈ అభ్యాస్ అకాడమీ 10వ కలాం సైంటిఫిక్ అప్టిట్యూడ్ టెస్ట్‌కు విశేషస్పందన లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి కలాం సైంటిఫిక్ అప్టిట్యూడ్ టెస్ట్ 3వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించారు. ఈ ప్రతిభ పరీక్ష మొదటి లెవెల్‌లో భాగంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 225 పాఠశాలల్లో 45 వేల మంది విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. ప్రతిభ కబర్చిన 16 వేల మంది విద్యార్థులకు రెండో లెవెల్ పరీక్షను ఏకకాలంలో నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. విద్యార్థులకు ప్రతిభ పరీక్షల ద్వారా వారిలో పోటీ తత్వం పెంచడంతో పాటు ధైర్యాన్ని కల్పించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సెయింట్ అంథోనీస్, సెయింట్ పీటర్స్, సెయింట్ జేవియర్స్ చైర్మన్ ఈథర అంథోనీ రెడ్డి, వివిధ పాఠశాలల ప్రిన్సిపాళ్లు మారెడ్డి, మహేందర్ రెడ్డి, సెయింట్ పీటర్స్ కరెస్పాండెంట్ రవి కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బ్యాడ్మింటన్ కోర్టు ప్రారంభం

బొల్లారం, ఫిబ్రవరి 25 : కాలనీల్లో, బస్తీల్లో క్రీడల అభివృద్ధికి ఎల్లప్పుడు కృషి చేస్తున్నట్లు బీఆర్ఎస్ నాయకులు, మాజీ జడ్పీటీసీ కొలన్ బాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని పాత బొల్లారం హనుమాన్ ఆలయ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ కోర్టును నిర్వాహకులు ప్రభాకర్‌రెడ్డితో కలిసి మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం కాసేపు సరదాగా నాయకులతో షటిల్ ఆడి ఉత్సాహ పరిచారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్‌లో క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. బాడ్మింటన్ కోర్టు సెంటర్‌ను ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు ప్రభాకర్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు రంగారెడ్డి, కౌన్సిలర్ బీరప్ప యాదవ్, నాయకుడు జైపాల్ రెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.



బొల్లారంలో బ్యాడ్మింటన్ కోర్టును ప్రారంభిస్తున్న మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి

# విజేతలకు బహుమతుల ప్రదానం

బొల్లారం, ఫిబ్రవరి 25 : బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ పేరిట నగరంలోని ఎల్బీస్టేడియంలో ఆదివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. బంజారా క్రికెట్ టోర్నీలో రాష్ట్ర కార్మిక నాయకుడు వరప్రసాద్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ట్రోఫీతో పాటుగా ప్రశంసాపత్రాలు అందజేశారు. బంజారా క్రీడాకారులను ప్రోత్సహిస్తూ, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమన్నారు.

# ఆర్టీసీ బస్సు 'కస్సు.. బుస్సు'

- ఒకప్పుడు ఆర్టీసీ ప్రయాణం సురక్షితం
- ఇప్పుడు నరకప్రాయం అవుతుందంటున్న ప్రయాణికులు
- బస్సుల్లో కిక్కిరిసిపోతున్న జనం
- కసురుకుంటున్న కండక్టర్, డ్రైవర్లు
- గతంలో చెయ్యెత్తిన చోట ఆపేవారు..
- ఇప్పుడు అడ్డం పడుతున్నా.. ఆగని పరిస్థితి



జోగిపేట బస్టాండ్‌లో బస్సు ఎక్కేందుకు బారులు తీరిన ప్రయాణికులు

అందోల్, ఫిబ్రవరి 25: ప్రయాణికులే మన సంస్థకు నిధి.. వారికి సేవచేయడమే మన విధి...ఈ బస్సు మనందరిది..ప్రయాణికులు ఎక్కడ చెయ్యెత్తినా బస్సును ఆపాలి. ఇలా మనం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేటప్పుడూ అందులో మనకు కనిపించే అక్షరాలు. ఇవన్నీ గతం. కానీ ఇప్పుడూ చెయ్యెత్తితే ఆపడం మాట దేవుడెరుగు అడ్డం పడుతున్నా బస్సులు ఆపే పరిస్థితి లేదని జనాలు ఆరోపిస్తున్నారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణం.. సురక్షితంగా ఉండేదని కానీ ఇప్పుడు మాత్రం కిక్కిరిసిన జనంతో డ్రైవర్, కండక్టర్ల ఈసడింపులతో కాలుపెట్టడానికి కూడా జాగలేని విధంగా ప్రయాణం చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోని వచ్చాక మహాలక్ష్మి పేరుతో మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో ప్రతి ఒక్కరికీ ప్రయాణంలో కష్టాలు మొదలయ్యాయి. బస్సుల్లో ప్రయాణించేవారి సంఖ్య పెరగడం, రద్దీకి తగినట్లుగా బస్సులు లేకపోవడం, పరిమితికి మించి ప్రయాణికులు వెళ్తున్నారు. దీంతో పలు ప్రమాదాలు జరుగగా.. సీట్లకోసం మహిళలు తిట్టుకొని.. కొట్టుకొని రోజంటూ ఉండడం లేదు. చాలా స్టాపుల్లో బస్సులు నిలపడంలేదు. బస్సులో అప్పటికే పరిమితికి మించి ప్రయాణికులు ఉండడం..? వారు దిగే స్టేజీ వద్ద మళ్లీ పెద్ద సంఖ్యలో జనాలు ఉండడంతో స్టేజీకి చాలా దూరం వెళ్లి బస్సును ఆపుతున్నారు. దీంతో అక్కడి నుంచి వారి నడిచి రావడం, బస్సు ఎక్కేందుకు ఆగిన బస్సు వరకు ప్రయాణికులు పరిగెత్తడం నిత్యం రోడ్లపై దర్శనమిస్తున్నది. స్టేజీల వద్ద ఎందుకు బస్సును ఆపడంలేదని ప్రయాణికులు సిబ్బందిని ప్రశ్నిస్తే దురుసుగా సమాధానం చెబుతున్నారు. రిక్వెస్ట్ స్టాపుల వద్ద కూడా బస్సులు ఆపడం లేదని ఆరోపణలున్నాయి. మహాలక్ష్మి పథకం లేక ముందు బస్సుల్లో మహిళలు ఎవరైనా నిలబడితే పురుషులు లేచి సీటు ఇచ్చేవారిని కానీ ఇప్పుడూ అడిగిన సీటు ఇవ్వడం లేదు. పైగా పుణ్యానికి ప్రయాణిస్తూ సీట్లు కావాలా ? అంటున్నారని మహిళలు బాధపడుతున్నారు. కండక్టర్, డైవర్లు సైతం ఇష్టం వచ్చిన చోట ఆపుతున్నారని.. ఏమన్న అంటే కస్సు..బుస్సుమంటున్నారని ఆరోపిస్తున్నారు. మేమేమన్నా ఫ్రీ బస్సులు పెట్టమన్నమా ? ఫ్రీ బస్సులు పెట్టి మాకు విలువలేకుండా చేశారు అంటూ తిట్ల దండకం అందుకుంటున్నారు.



ఎక్స్‌ప్రెస్ బస్సులో పల్లెవెలుగు బోర్డులు

## మేడారం తరలింపుతో రెట్టింపు కష్టాలు

మహాలక్ష్మి పథకం అమలుతో ఏ బస్సు చూసినా మహిళలతో కిక్కిరిసిపోతున్నది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు లేక ప్రజలు అవస్థలు పడుతుండగా మేడారం జాతర కోసం పెద్ద సంఖ్యలో బస్సులు వెళ్లడంతో ప్రయాణికులకు కష్టాలు రెట్టింపయ్యాయి. వారం రోజులుగా చాలా గ్రామాలకు బస్సు సర్వీసులు పూర్తిగా నిలిచిపోవడంతో పాటు ప్రధాన మార్గాల్లో సైతం బస్సుల సంఖ్య గణనీయంగా తగ్గింది. దీంతో వచ్చిన బస్సుల్లోనే లెక్కకు మించి ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు. జిల్లాలోని మూడు ఆర్టీసీ డిపోల పరిధిలో 246 బస్సు సర్వీసులుండగా 124 బస్సులను మేడారం జాతర కోసం పంపించారు. ఇందు లో అత్యధికంగా సంగారెడ్డి నుంచి 51 బస్సులు మేడారం వెళ్లాయి. దీంతో ఒక్కసారిగా బస్సుల కొరత ఏర్పడింది. చాలా రూట్లలో సరిపోను బస్సులు రాకా.. వచ్చిన బస్సుల్లో కాలు పెట్టేందుకు సైతం స్థలం లేక ప్రజలు పడుతున్న బాధలు వర్ణానాతీతం. బస్సుల కొరత కారణంగా ఆర్టీసీ అధికారులు ఆర్డినరీ బస్సులకే ఎక్స్‌ప్రెస్ బోర్డులు తగిలించి పలు రూట్లలో తిప్పుతూ అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఆర్డినరీ బస్సుల్లో ఎక్స్‌ప్రెస్ చార్జీలు వసూలు చేయడం ఏమిటని ప్రశ్నిస్తే ఇష్టమైతే ఎక్కు? లేకుంటే దిగు అని సమాధానం ఇస్తున్నారని ఓ ప్రయాణికుడు వాపోయాడు. ఏంచేస్తాం.. బస్సులు లేవాయే.. వారు చెప్పినట్లు డబ్బులు ఇచ్చి వెళ్లాల్సిందే అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. బయట ఎక్స్‌ప్రెస్ బోర్డులు తగిలించి ఉండగా లోపల మాత్రం పల్లె వెలుగు బోర్డులు కనిపిస్తుండడం విశేషం.



ఆర్డినరీ బస్సుకు ఎక్స్‌ప్రెస్ బోర్డు

# లాస్య నందిత కుటుంబానికి పరామర్శ



కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, ఫిబ్రవరి 25 : రెండు రోజులు కింద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత కుటుంబాన్ని ఆదివారం నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పరామర్శించారు. చిన్న వయస్సులోనే ప్రజాదరణ పొంది ఎమ్మెల్యేగా ఎన్నికైన లాస్య నందిత మృతి బాధాకరమన్నారు. మాజీ ఎమ్మెల్యే వెంట కూతురు శ్రేయా రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు ఉన్నారు.

# కేతకీలో సివిల్ కోర్టు జడ్జి పూజలు



సివిల్ జడ్జికి పూలమాలతో సన్మానిస్తున్న అధికారులు, అర్చకులు

ఝరాసంగం, ఫిబ్రవరి 25 : మండల కేంద్రంలోని దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో మహారాష్ట్ర అమరావతి జిల్లా దర్యాపూర్ సివిల్ కోర్టు జడ్జి ఓం శంకర్ పాటిల్ ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం జడ్జికి ఆలయ అర్చకులు రాజగోపురం వద్ద పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలోని అమృత గుండంలో జల లింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించి గర్భాలయంలోని శ్రీ పార్వతీసమేత సంగమేశ్వర స్వామిని దర్శించుకొని అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అధికారులు జడ్జిని సన్మానించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

# ఎల్గోయిలో హరితహారం చెట్లు దగ్ధం



ఎల్గోయి గ్రామ శివారులో కాలిపోయిన హరితహారం మొక్కలు

ఝరాసంగం, ఫిబ్రవరి 25: బాటసారులు అంటించే నిప్పు కారణంగా హరితహారంలో నాటిన చెట్లు కాలి బూడిదైపోయాయి. ఈ ఘటన మండల కేంద్రంలోని ఎల్గోయి గ్రామ శివారులో చోటు చేసుకుంది. కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారం పథకంలో భాగంగా నాటిన మొక్కలు ఎదిగేంత వరకు సంరక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. ఝరాసంగం నుంచి ఎల్గోయి వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలకు కంచెలు లేని కారణంగా కొన్ని పశువులకు మేతగానూ, మిగిలినవి బాటసారులు అంటించే నిప్పు కారణంగా కాలి బూడిదవుతున్నాయి. దీంతో ప్రజధనం వృథా అవుతుందని పర్యావరణవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మొక్కలను కాపాడి పర్యావరణ సంరక్షణకు పాటుపడాలని స్థానికులు కోరుతున్నారు.

# కోహీర్ విశ్వేశ్వరాలయంలో హోమం



విశ్వేశ్వరాలయంలో హోమం చేస్తున్న భక్తులు

కోహీర్, ఫిబ్రవరి 25 : కోహీర్ (ఓంకార పట్టణం)లోని విశ్వేశ్వరాలయంలో దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శివలింగం, నందీశ్వరుడు, గణపతి, నాగదేవత, భద్రకాళి, వీరభద్రేశ్వరుడి విగ్రహాలకు పలు రకాల పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛారణల మధ్య హోమం నిర్వహించారు. నేడు ఆలయంలో దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

# విజయ సంకల్ప యాత్రను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న బీజేపీ న్యాల్‌కల్ మండలాధ్యక్షుడు ఓంకార్‌యాదవ్

న్యాల్‌కల్, ఫిబ్రవరి 25: గ్రామాల్లో విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు ఓంకార్ యాదవ్ కోరారు. ఆదివారం మండలంలోని ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమంలో ఏర్పాటు చేసిన మండల కార్యకర్తల సమావేశంలో విజయ సంకల్ప యాత్ర గోడ, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28న మండలంలోని గంగ్వార్ చౌరస్తా నుంచి విజయ సంకల్పయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో మండలాధ్యక్షుడు ఓంకార్ యాదవ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**LOST OF DOCUMENT**

P.Manik Rao S/o. P.Mallaiah, Age:55, R/o.18-7-846/37, O/S. Gowlipura, Mekalamandi Charminar, Falaknuma, Hyderabad, T.S. 500053. I have lost my original Deed Document 9236/1987 Registered at R.O. Sangareddy. Open Plot No. 35, in Survey No. 214/అ, 214/ఆ, 214/ఇ, 214/ఈ, 214/ఊ, 214/రూ, admeasuring 200 Sq.yds which is equivalent to 167.2 Sq.mts Situated at Kollur village under Tellapur municipality, Ramachandrapur Mandal, Sangareddy (D), T.S. While Travelling from Kollur to Sangareddy. Inspite of my best effort, I am unable to trace it, if anyone, found please Contact my number: **9948142508**

## బీజేపీ జిన్నారం మండల నూతన కమిటీ ఎన్నిక

జిన్నారం, ఫిబ్రవరి 25 : జిన్నారం మండల బీజేపీ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా కొత్తకాపు జగన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా కమ్మరి కృష్ణ, వీరగోని రాజుగౌడ్, పూడూరు సుధాకర్, అరికెల సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శులుగా వెంకటేశ్, మద్దూరి రాజు, కార్యదర్శులుగా సీతారాజ్ యాదవ్, నక్కీర్తి పద్మారావు, కురుపల్లి నరసింహా, లక్ష్మణ్, మద్దూరి మహేశ్, వెంకటేశ్, కోశాధికారిగా ఎల్లేశ్‌లను ఎన్నుకున్నారు. మండల కమిటీతో పాటు యువ, మహిళా, బీసీమోర్చా కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు నర్సింగ్‌రావు, ప్రతాప్‌రెడ్డి, రమేశ్, రాజిరెడ్డి, కొండరాజు, భార్గవ్, ఆదిత్య, వినోద్, నాగరాజు, సంతోశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## కరాటేలో ప్రతిభ చూపిన విద్యార్థినులకు సన్మానం



విద్యార్థినులను సన్మానిస్తున్న జడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్

నారాయణఖేడ్, ఫిబ్రవరి 25 : నారాయణఖేడ్ నియోజకవర్గంలోని వివిధ ఉన్నత పాఠశాలలకు చెందిన 20 మంది విద్యార్థినులు అండర్ 14 విభాగంలో కరాటేలో గోల్డ్ మెడల్ సాధించిన సందర్భంగా ఆదివారం జడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, విద్యార్థునులను సన్మానించారు. ఆత్మరక్షణ కోసం బాలికలు కరాటే నేర్చుకోవడం ఎంతో అవసరమని తెలిపారు. తమ ప్రాంతానికి చెందిన విద్యార్థినులు కరాటేలో నేషనల్ చాంపియన్‌షిప్ సాధించడం ఆనందంగా ఉందన్నారు. ఇందుకు విదార్థినులను ప్రోత్సహించిన జమ్లాతండా మాజీ సర్పంచ్ దివ్య భారతి చరణ్‌ను ఆమె అభినందించారు.

# కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత



కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి

నారాయణఖేడ్, ఫిబ్రవరి 25: నియోజకవర్గంలోని 122 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు ఆదివారం ఎమ్మెల్యే పటోళ్ల సంజీవ్ రెడ్డి చెక్కులను అందజేశారు. తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను పార్టీలకతీతంగా అమలు చేస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈనెల 27 నుంచి ఆరు గ్యారెంటీల్లో భాగంగా మరో రెండు పథకాలను ప్రారంభిస్తున్నామన్నారు.

**సీసీరోడ్డు, హైమాస్ట్ లైట్ల ప్రారంభం**

మండలంలోని తుర్కపల్లిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీరోడ్డు, జడ్పీ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఎమ్మెల్యే పటోళ్ల సంజీవ్‌రెడ్డి ప్రారంభించారు. గ్రామాలను అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్ నాయక్, నాయకులు సుధాకర్‌రెడ్డి, రమేశ్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

# బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలి

**ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు**

న్యాల్‌కల్, ఫిబ్రవరి 25 : మండలంలోని హద్నూర్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం గ్రామానికి చెందిన యువకులు నారాయణఖేడ్ ఎక్సైజ్ అధికారులకు కలిసి మద్యం విక్రయిస్తున్న బెల్టు షాపులపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ గ్రామంలో యథేచ్ఛగా బెల్టు షాపులో మద్యం విక్రయిస్తున్నారన్నారు. బెల్టు షాపుల్లో 24 గంటలు మద్యం అందుబాటులో ఉండడంతో యువత పెడదారి పడుతుందన్నారు. ఇటీవల గ్రామంలో మద్యం విక్రయాలను నిలిపివేయాలని గ్రామస్తులందరూ చర్చించి తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. గ్రామంలో మద్యం అమ్మినా, తాగినా జరిమానాలను విధిస్తూ తీర్మానం చేశామని వివరించారు. బెల్టు షాపులపై దాడులు నిర్వహించి వాటిని మూసివేసి కుటుంబాలను కాపాడాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.



బెల్టు షాపులను మూసివేయాలని అధికారులను ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు



అమీన్‌పూర్‌లో సమ్మక్క గద్దె వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

# ముగిసిన సమ్మక్క-సారక్క జాతర

అమీన్‌పూర్, ఫిబ్రవరి 25: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో ఐదు రోజులుగా వైభవంగా సాగిన 'సమ్మక్క–సారక్క' జాతర ఉత్సవాలు ముగిశాయని ఆలయ కమిటీ చైర్మన్ నీలం భిక్షపతి అన్నారు. ఆదివారం ఉదయం నుంచి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాలుగు రోజలుగా కొనసాగిన జాతరమహోత్సవాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. చివరి రోజు మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నర్సింహాగౌడ్, నాయకులు ఉపేందర్‌రెడ్డి, తలారి రాములు, భక్తులు పాల్గొని అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు.

# కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి




మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్

జహీరాబాద్, ఫిబ్రవరి 25 : పరిశ్రమల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్. మహిపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం జహీరాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్మిక చట్టాలను అమలు చేయాలని పరిశ్రమల యాజమాన్యాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులకు కనీస వేత్తనం రూ. 26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జహీరాబాద్ ప్రాంతంలో ఉన్న అనేక పరిశ్రమల్లో కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. చట్టప్రకారం రావలసిన సమాన పనికి సమానవేతనం ఇవ్వాలన్నారు. కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేసే వరకు పోరాటం చేస్తామన్నారు. పరిశ్రమల యాజమాన్యాలు కార్మికుల శ్రమ దోపిడీ చేస్తున్నారన్నారు. చట్టాలు అమలు చేయని పరిశ్రమల యాజమాన్యాలపై కార్మిక శాఖ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు నరేశ్, సందీప్‌రెడ్డి, విజయ్ కుమార్, మల్లేశం, పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

# వైభవంగా చిత్తారమ్మ జాతర

జిన్నారం, ఫిబ్రవరి 25 : మండలంలోని సోలక్‌పల్లిలో చిత్తారమ్మ జాతర ఆదివారం వైభవంగా జరిగింది. జాతరలో భాగంగా భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం, అగ్నిగుండాలు, గొలుసు తెంపుట, బండ్లు బోనాలు కార్యక్రమాలు జాతర నిర్వాహకుడు, మాజీ సర్పంచ్ రాములు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జాతరకు గ్రామస్తులతో పాటు ఇతర గ్రామాల ప్రజలు విచ్చేసి మల్లన్నను దర్శించుకొని పూజలు చేశారు. జాతరకు జడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ఆదర్శ్‌రెడ్డి, స్థానిక ఎంపీటీసీ స్వాతి ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు శెట్టి శివరాజ్, ఆంజనేయులు స్థానిక నాయకులతో కలిసి స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ రాములు యాదవ్ జాతరకు హాజరైన ముఖ్య అతిథులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాగౌడ్, శాంత వర్మారెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్ రెడ్డి, నరేశ్ పాల్గొన్నారు.



చిత్తారమ్మ జాతరలో జడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, బీఆర్ఎస్ నేత ఆదర్శ్‌రెడ్డి

# కేసీఆర్ సర్కారులోనే అన్ని కులాలకు న్యాయం

అమీన్‌పూర్, ఫిబ్రవరి 25 : కేసీఆర్ ప్రభుత్వంలోనే అన్ని కులాలకు ప్రాధాన్యత లభించిందని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నందారం నర్సింహగౌడ్ అన్నారు. ఆదివారం బీరంగూడ గుట్టపై అమీన్‌పూర్ పద్మశాలి సంఘ భవనాన్ని చైర్మన్ పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నర్సింహాగౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ పద్మశాలీలకు పెద్దపీట వేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని పద్మశాలీలకు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సైతం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో పటాన్‌చెరు నియజకవర్గ పద్మశాలి సంఘం నాయకులు మ్యాకం మల్లేశ్, కౌన్సిలర్లు కల్పన ఉపేందర్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు యూనూస్, తలారి రాములు, బీఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్, నందారం రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.



పద్మశాలి సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి